క్లుప్తంగా

'స్పందన'కు 11 ఫిర్యాదులు

రేపల్లె రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 11 అర్జీలు అందినట్లు కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి జాన్‌పీటర్ చెప్పారు. చెరుకుపల్లిలోని ప్రధాన కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం తొలగించే ప్రయత్నాన్ని నిలువరించాలని జై భీమ్ భారత్ పార్టీ నాయకుడు దోవా రమేష్ రాంజీ వినతిపత్రం అందజేశారని తెలిపారు. అమర్తలూరు నుంచి 2, నగరం నుంచి 1, కొల్లూరు నుంచి 2, రేపల్లె నుంచి 2, భట్టిప్రోలు నుంచి 1, కొల్లూరు నుంచి 1, పోలీసు కేసుకు సంబంధించి 1 చొప్పున అర్జీలు అందాయన్నారు. సమస్యలను పరిశీలించి, ఆయాశాఖల ద్వారా పరిష్కరించటం జరుగుతుందన్నారు.

విప్లవకారులకు రుణపడి ఉంటాం

రేపల్లె: ప్రజల సమస్యల పరిష్కారంలో నిరంతరం పోరాటాలు జరిపి, ప్రాణ త్యాగం చేసిన విప్లవకారులకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటారని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. విద్యుత్ ఉద్యమంలో 2000లో పోలీసు కాల్పుల్లో మృతిచెందిన అమరవీరులు రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామికి స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. పెరుగుతున్న విద్యుత్ భారాలపై ప్రజలు ఉద్యమాల్లో ముందుకు రావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యుత్ పాలసీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రాయితీలు కూడా ప్రజలకు అందకుండా అన్ని రకాల విద్యుత్ చార్జీలు పెంచాలని సంస్కరణలు అమలుచే సేందుకు సిద్ధమవుతోందన్నారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆశీర్వాదం, కేవీ లక్ష్మణరావు, జె.ధర్మరాజు, డి.శ్రీనివాసరావు, సిహెచ్.ఆగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.

బసవమందిర స్మారక సత్రానికి శంకుస్థాపన



తెనాలిటౌన్: తెనాలి పట్టణం ఆరోవ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న కొల్లిపర బసవ మందిర స్మారక సత్రానికి సోమవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శంకుస్థాపన చేశారు. గుడి నిర్మాణానికి రూ.ఐదు లక్షల విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువరానివి



తెనాలిఅర్బన్: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేసిన పోరాటంలో అశువులుబాసిన అమరవీరుల త్యాగాలు మరువరానివని సీపీఎం తెనాలి డివిజన్ కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ కొనియాడారు. విద్యుత్ ఉద్యోగులు 2000 సంవత్సరంలో ఆగస్టు 28న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో చేస్తున్న పోరాటంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో మరణించిన ఉద్యోగుల సంస్మరణ సభను చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో సీపీఎం నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, రావూరి శివకృష్ణ, బ్రహ్మారెడ్డి, కె.రవికుమార్, జి.వెంకటసుబ్బయ్య, చుక్కపల్లి శేషగిరిరావు, ఈశ్వరి, దుర్గాప్రసాద్, సాయి, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

తెనాలిఅర్బన్: నల్లగండ్ల పెదరంగయ్య ఐదోవ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లగండ్ల రవిచంద్రబాబు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్య వేదిక సేవాట్రస్ట్ అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్‌ల సంయుక్త ఆధ్వర్యంలో చెంచుపేటలోని అమ్మ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం దుస్తులు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ యాతాటి అనిల్, సేవా ట్రస్ట్ పట్టణ అధ్యక్షుడు జూపల్లి వంశీ, రూరల్ అధ్యక్షుడు కుర్రా జశ్వంత్ యాదవ్, సల్మాన్, కనపర్తి శశి, పసుపులేటి హర్ష, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'గడప గడపకు'

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు



వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. మండలంలోని ధూళిపూడి, తూర్పుబందెల వారిపాలెం, ఎట్టివారిమాలపల్లి గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తూర్పుబందెలవారిపాలెంలో వర్షపు నీటి నిల్వలు తొలగించాలని, విద్యుత్ స్తంభాలు వేయించాలని గ్రామస్తులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఎంపీ మోపిదేవి వర్షపు నీరు పోయేవిధంగా సైడ్ కాల్వలు తవ్వించాలని పంచాయతీ అధికారులకు, విద్యుత్ సరఫరాకు అసౌకర్యం కలగకుండా తక్షణమే స్తంభాలను వేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూర్చాలనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలను ప్రవేశపెట్టి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందిస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల కోసం అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా గ్రామ సచివాలయ వ్యవస్థతో నేరుగా అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలలో అత్యాధునిక సౌకర్యాలను ఏర్పాటు చేసి, వాటి రూపురేఖలను మార్చారని ఎంపీ తెలిపారు. ఏ ఇంటికి వెళ్లినా సంక్షేమ పథకాలతో సంతోషంగా జీవిస్తున్నామని ప్రజలు చెబుతుంటే.. ప్రతిపక్ష నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నాయకుడు..

కొలగానివారిపాలెం శివారు నాగిశెట్టివారిపాలేనికి చెందిన జనసేన నాయకుడు కోటిపల్లి రాంబాబు ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య ఆధ్వర్యంలో ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీ మోపిదేవి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ధూళిపూడి సచివాలయ పరిధిలోని 650 గృహాలను ఎంపీ మోపిదేవి సందర్శించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కురగంటి హేమామృతం, తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆనంద్, బాబురావు, రాఘవేంద్ర, దాసు, బాబావలి, భాస్కరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రసాదం వాసుదేవ, సర్పంచ్ నజీర్ అహ్మద్

నిజాంపట్నం: అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ జెడ్పీటీసీ ప్రసాదం వాసుదేవ అన్నారు. బావాజీపాలెంలో ఇటీవల అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన షేక్ షరీఫ్ కుటుంబానికి సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాదం వాసుదేవ మాట్లాడుతూ నిజాంపట్నం జెడ్పీ హైస్కూల్లో 1988–89లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు టైటాన్స్ బ్యాచ్ ఏర్పాటు చేసి, ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నారని చెప్పారు. ఈ బ్యాచ్ విద్యార్థులు షరీఫ్ కుటుంబానికి రూ.11వేల ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో టైటాన్స్ బ్యాచ్ ఎప్పుడూ ముందుంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నజీర్ అహ్మద్, సలీమ్, నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా ఆడిట్



ఓటరు జాబితాలను ఆడిట్ చేస్తున్న అధికారిణి పద్మజ, సిబ్బంది

కొల్లూరు : ఓటరు జాబితా సమగ్ర సవరణ ఇంటింటి సర్వే పూర్తయిన నేపథ్యంలో ఆడిట్ ప్రక్రియను అధికారులు చేపట్టారు. జిల్లా ఆడిట్ అధికారిణి కె.పద్మజ నేతృత్వంలో సిబ్బంది సోమవారం కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో పోలింగ్ బూత్‌ల వారీగా ఓటరు జాబితాలను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి.. అక్కడ ఓటర్లు ఉంటున్నదీ.. లేనిదీ విచారణ జరిపారు. ఓటరు జాబితా పారదర్శకంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఉండేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆడిట్ ప్రక్రియ చేపట్టిన అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నారా లోకేష్‌పై నల్లపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు



ఎస్సైకు లోకేష్‌పై ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుంటూరు రూరల్ : రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా నారా లోకేష్ మాట్లాడుతున్నారని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రత్తిపాడు నియోజకవర్గం కో–కన్వీనర్ బచ్చనబోయిన గోపియాదవ్ నల్లపాడు పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. 2019 నుంచి 2024 వరకు ఏ కార్యకర్త మీద ఎక్కువ కేసులు ఉంటే వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామంటూ ఉద్దేశపూర్వకంగా రెచ్చగొడుతున్నారని, దీని వల్ల గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో గొడవలు జరిగి, హత్యలకు దారి తీసే ప్రమాదం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇవి ఎక్కువగా జరిగే ప్రమాదం ఉన్నందున లోకేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో గుంటూరు మిర్చి యార్డు డైరెక్టర్ బొందలపాటి వెంకటేశ్వరరావు (ఇంద్ర), తురకపాలెం సొసైటీ డైరెక్టర్ రాజా ఉన్నారు.

డిప్లమో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ఆర్‌వీఐటీ కళాశాల వైస్ చైర్మన్ గొట్టిపాటి మస్తాన్ చౌదరి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైస్ చైర్మన్ మస్తాన్ చౌదరి

చేబ్రోలు: డిప్లమో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆర్‌వీ ఐటీ కళాశాల వైస్ చైర్మన్ గొట్టిపాటి మస్తాన్ చౌదరి అన్నారు. చేబ్రోలులోని కళాశాలలో సోమవారం డిప్లమో మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిప్లమో కోర్సులో ప్రతిభ కనబరిచి, అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మానించారు. నగదు బహుమతులను అందజేశారు. డిప్లమో విద్యార్థులు ఈ ఏడాది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి రాష్ట్రంలో మూడో స్థానంలో, జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్లు కళాశాల డైరెక్టర్ మాలెపాటి శ్రీనివాస్ తెలిపారు. ప్రిన్సిపల్ దూళ్ల శ్రీధర్, వైస్ ప్రిన్సిపల్ పట్టాభి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్నారు..

- గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగుల ఆనందం
- జీతాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్వర్వులు..
- హర్షం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం..



వేమూరులో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ సిబ్బంది

వేమూరు: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) అధ్వర్యంలోని గ్రామీణ పేదరికం నిర్మూలన సంస్థ(సెర్ప్) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. వీరి జీతాలు 23శాతం పెంచుతూ జీవో నంబరు64ను విడదల చేసింది. పెరిగిన జీతం ఆగస్టు 1 నుంచి వర్తింపజేస్తున్నట్లు ప్రభుత్వం జీవోలో పేర్కొంది. దీంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగులు.. స్వయం సహాయక సంఘాల ఉన్నతికి విశేషంగా కృషి చేస్తున్నారు. వేమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభి షేకం చేశారు.

వారు ఎంతో కీలకం..

సెర్ప్ ఉద్యోగులు జిల్లా ప్రాజెక్టు మేనేజరు, అసిస్టెంట్ మేనేజరు, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్, అడ్మిన్, అసిస్టెంటు ఉన్నారు. వీరిలో చాలా మంది 2002 నుంచి పని చేస్తున్నారు. ఎస్‌హెచ్‌జీల అభ్యున్నతికి వీరు కృషి చేస్తున్నారు. వాణిజ్య బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు, వాయిదాల చెల్లింపులు, స్త్రీనిధి బ్యాంక్ ద్వారా రుణాలు ఇవ్వడం ద్వారా ఎస్‌హెచ్‌జీ గ్రూపుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, జగనన్న పాల వెల్లువ వంటి పథకాల లబ్ధిని మహిళల పొందేలా కృషి చేస్తున్నారు. వారి వ్యాపారాలకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఉండే విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్‌ను సమన్వయం చేసుకొని సంఘాలఉన్నతికి కృషి చేస్తున్నారు.

సీఎం వైఎస్ జగన్ నిర్ణయంతో సర్వత్రా హర్షం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సెర్ప్ వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో.. డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్లు ఐదుగురు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు 29, క్లస్టరు కో–ఆర్డినేటర్లు 80 మంది, అడ్మిన్ అసిస్టెంట్ ముగ్గురికి చొప్పున 117 మందికి జీతాలు పెరగనున్నాయి. బేసిక్ జీతం మీద రూ.4 వేలు నుంచి 12 వేలు వరకు జీతం పెరిగింది. వీరికి గతంలో ఉద్యోగ భద్రతను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కల్పించడం విశేషం, అప్పట్లో తండ్రి ఉద్యోగ భద్రత కల్పిస్తే.. తనయుడు జగన్ 23 శాతం జీతాలు పెంచి, తోడ్పాటు అందించారు.

చాల సంతోషంగా ఉంది.

మాకు 23 శాతం జీతం పెంచడం చాలా సంతోషంగా ఉంది. దీంతో కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండదు. ఆర్థికంగా నిలదొక్కుంటాం. ఉత్సాహంగా పని చేయడానికి ఇదొక అవకాశం. ప్రభుత్వం పథకాలు ప్రతి లబ్ధిదారుడికి చేరేలా మరింత కృషి చేస్తాం, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

– షాలేం రాజు, ఏపీఎం, చుండూరు.

మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి..

వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగులకు జీతాలు పెంపుదల చేస్తామని గతంలో ముఖ్యమంత్రి చెప్పారు. మాట ప్రకారం ఉద్యోగులకు బేసిక్ 23 శాతం జీతం పెంచడం ఆనందంగా ఉంది. జీవితాంతం సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాను.

– శోభన్‌బాబు, ఏపీఎం, వేమూరు.

కార్మికులకు అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య మలేరియా విభాగ కార్మికుడు బండి రాజు కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్ ను సోమవారం కమిషనర్ చాంబర్‌లో బయాలజిస్ట్ మధుసూదన్‌తో కలిసి కమిషనర్ అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందన్నారు. ప్రజారోగ్య మలేరియా విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహించే బండి రాజు ఇటీవల కాలంలో అనారోగ్యం వలన మరణించారని, ఆయన భార్య రమణకు ఎక్స్ గ్రేషియా రూ.2 లక్షల చెక్ ని అందించామన్నారు. నగరపాలక సంస్థ నుంచి అందాల్సిన పరిహారాలు, పి.ఎఫ్. త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను, సూపరింటెండెంట్లను ఆదేశించారు. కార్మికులు కూడా తమ సమస్యల పై ప్రతి గురువారం జరిగే ఉద్యోగుల గ్రీవెన్స్‌లో అర్జీలు, ఫిర్యాదులు అందివచ్చని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సత్తా చాటిన జీజీహెచ్ నర్సింగ్ సిబ్బంది



నర్సింగ్ సిబ్బందిని అభినందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో ఈ నెల 25, 26 వ తేదీల్లో జాతీయ ఆంకాలజీ నర్సింగ్, సింపోజియం జరిగింది. ఈపోటీల్లో గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్ నర్సింగ్ సిబ్బంది తమ సత్తా చూపారు. సదస్సులో దేశ వ్యాప్తంగా హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు 1200 మంది పాల్గొన్నారు. గుంటూరు నాట్కో క్యాన్సర్ కేంద్రం నుంచి ఏడుగురు హాజరయ్యారు. క్యాన్సర్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ టి.వి. శివరామకృష్ణ ఆధ్వర్యంలో హాజరైన గుంటూరు జీజీహెచ్ నర్సింగ్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందుకున్నారు. సోమవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ ను నర్సింగ్ సిబ్బందిక కలిసి తమ విజయ గాథను పంచుకున్నారు. పోస్టర్ ప్రెసెంటేషన్‌లో హెడ్ నర్సు దాసరి రోజ్‌రాణి, జి. గౌరీ కల్యాణి, కె. రాజ్యలక్ష్మి బహుమతులు సాధించారు. క్విజ్ పోటీల్లో స్టాఫ్ నర్సులు జి.ఉషారాణి, కె.వెంకట సుబ్బమ్మలకు ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ నర్సింగ్ సిబ్బంది ప్రశంస పత్రాలతో పాటు నగదు బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం హెడ్‌నర్సు రోజ్ రాణి ఆధ్వర్యంలో రూ. 5 వేలు నర్సింగ్ సిబ్బంది అందజేశారు. ఆసుపత్రిలో పనిచేస్తూ వారికి వచ్చిన నగదును తిరిగి ఆసుపత్రి కోసం ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని పాల్గొన్నారు.

జీవ్ దయ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

గుంటూరు మెడికల్: జీవ్ దయ ఫౌండేషన్ నిర్వాహకులు సోమవారం గుంటూరు జీజీహెచ్ గైనకాలజీ వైద్య విభాగానికి రూ. 50 వేలు విలువ చేసే వైద్య పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ గైనకాలజీ విభాగాలకు ఈ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సేవ దృక్పథంతో వైద్య పరికరాలు అందించిన జీవ్ దయ ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.జయంతి మాట్లాడుతు గర్భిణులకు కాన్పుల సమయంలో ఇబ్బందులు పడకుండా, అధిక రక్త స్రావం జరగకుండా నివారించేందుకు అత్యాధునిక వైద్య పరికరాలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. సంస్థ అందజేసిన వైద్య పరికరాలను సూపరింటెండెంట్ చేతుల మీదుగా గైనకాలజీ విభాగానికి సరఫరా చేశారు. కార్యక్రమం లో డాక్టర్ వి.అరుణ, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ దుర్గాదేవి, పాల్గొన్నారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ

గుంటూరు ఈస్ట్: రెండు వర్గాలు ఘర్షణపడ్డ ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్త కాలనీలో నివసించేర ఆమకృష్ణకు దుర్గానగర్‌కు చెందిన సాయికృష్ణ ఫోన్ చేశాడు. రామకృష్ణ ఫోన్ మరొకరికి ఇచ్చి తాను లేనని చెప్పించాడు. ఈనేపథ్యంలో సాయికృష్ణ, తరుణ్, సుందరయ్యలు రామకృష్ణ వద్దకు వచ్చి గొడవపడి కొట్టారు. రామకృష్ణ తన మిత్రుడు సాయి వెంటబెట్టుకుని వెళ్లి ముగ్గురిపై దాడిచేసి కొట్టారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

తెనాలిఅర్బన్: హెల్త్ హాస్పటల్ తెనాలి వారి ఆధ్వర్యంలో పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద సోమవారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. హెల్త్ హాస్పటల్ వైద్యులు, బ్యాంకు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు కంటి, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్నవారికి కూడా పరీక్షలు జరిపి మందులను పంపిణీ చేశారు. హెల్త్ హాస్పటల్ సీఈవో గిరిబాబు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బ్రాంచ్ మేనేజర్ సిహెచ్‌వి.మనోహర్ పాల్గొన్నారు.

మాలల అభ్యున్నతికి కృషి

నెహ్రూ నగర్: రాష్ట్రంలోని మాలల అభివృద్ధికి వారి అభ్యున్నతికి మాల ఐక్య సేవా సమితి కృషి చేస్తుందని మాల ఐక్య సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు బండ్లమూడి స్టాలిన్ బాబు పేర్కొన్నారు. సోమవారం గుంటూరు అంబేద్కర్ భవన్ లో మాల ఐక్య సేవా సమితి ఆవిర్భావ దినోత్సవ సభ నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజ సుందర బాబు, కర్రా హనోక్ బెంజిమెన్, విప్పర్ల భాస్కర్ పాల్గొని ప్రసంగిస్తూ రాష్ట్రంలో రోజు రోజుకు మాలల ఐక్యత లేకపోవడం వలన అగ్రవర్ణ నాయకులు దాడులు చేయడం పరిపాటి మారిపోయిందని ఈ రాష్ట్రంలో మాలలు ఐక్యతగా ఉన్నప్పుడే మాలల మీద దాడులు ఆగుతాయని ఆ దిశగా మాలలు అందరూ రాజకీయాలకు అతీతంగా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బండ్లమూడి స్టాలిన్ బాబు మాట్లాడుతూ ఈ దేశంలో రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలపై దాడులు జరిగినప్పుడు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేస్తున్నారు తప్ప వారికి సరైన న్యాయం జరగటం లేదని రాజకీయ నాయకులు వారి స్వార్థ రాజకీయాల కోసం ఎస్సీ ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ బాధితులకు అన్యాయం జరుగుతున్న సందర్భంలో మాల ఐక్య సేవా సమితి తరపున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేశారు. అనంతరం బండ్లమూడి స్టాలిన్ బాబు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తన్నీరు ప్రసన్నకుమారి, ఉద్యోగుల విభాగం అధ్యక్షులుగా మేళం సునీల్ ప్రకాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అక్కల వీరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి గోన మరియమ్మ, యువజన విభాగం అధ్యక్షులుగా నూకతోటి ఆనంద్, ముఖ్య సలహాదారునిగా డేవిడ్ విలియమ్స్, సలహాదారుగా చిన్నం డేవిడ్, జిల్లా అధ్యక్షులుగా గుడిపూడి బాబు, జిల్లా ఉపాధ్యక్షులుగా మంచాల భాగ్యరాజ్, జిల్లా కార్యదర్శిగా గుమ్మడి చిన్న, మహిళా జిల్లా కార్యదర్శిగా ఆదిలక్ష్మి, నగర అధ్యక్షులుగా గజ్జి అరవింద్ బాబును ఎన్నుకున్నారు. జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి మాలల అభివృద్ధి అభ్యున్నతికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మహిళలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.